అంతరార్థం

అతన్ని చూడంగానే మామగారు మొఖం తిప్పుకొన్నాడు. అత్త చెంబుతో నీళ్ళిచ్చి, మాటా పలుకూ లేకుండా లోపలి కెళ్ళిపోయింది. అతన్ని పలకరించినవాళ్ళుగానీ, కనీసం కూచోమన్నవాళ్ళుగానీ ఎవరూ లేరు.

దాదాపు పావుగంటసేపు అతను అల్లాగే స్తంభానికి ఆనుకుని నిలబడి, కాళ్ళుతీపులు పుట్టడంచేత, నెరాబాలోవున్న మంచాన్ని రేకులకిందికి స్వయంగా లాక్కొని కూర్చున్నాడు. అతని బావమరదులుగానీ, వదినా మరదళ్ళుగానీ, అతనివేపు చూడనన్నా లేదు. చూసినా, ఒక మనిషి—అందులో అల్లుడు — వచ్చినట్లుగా వాళ్ళు కించిత్ మాత్రమైనా ఫీల్ అయినట్లు లేదు.

నాగేంద్రానికి ఉక్రోషం వొచ్చింది. చమటపోసింది. ఉద్రేకంవల్ల వొంటిమీది వెంట్రుకలు నిక్కబొడిచాయి. పిడికిలి బిగించి, సాచి, రెండుతీతలు మామగారిని తీద్దామనుకొన్నాడు. అత నంత సమర్థుడు గూడాను. మామగారు వృద్ధాప్య ప్రాంగణంలో అడుగుపెట్టాడు. కనుక ఎదిరించి తనను తిరిగి కొడతాడనే భయం అనవసరం. అత్తా వదినెల సంగతా?... వాళ్ళు ఆడవాళ్ళు. బావమరదులు చిన్నపిల్లలు.

ఏమయ్యేదీ చెప్పటం కష్టం! అత్త పలకరించింది. ఎంత చెడ్డా అల్లుడు అల్లుడే! ఎంత పుచ్చిన మిరియాలైనా జొన్నల పాటి విలువచెయ్యకపోవు.

నాగేంద్రం ప్రయత్నపూర్వకంగా తన కోపాన్నీ, ఆవేశాన్నీ అణుచుకొన్నాడు. తను వచ్చినపని వేరు. అది నెరవేరటానికి ఆవేశాలు పనికిరావు. ఒకప్పుడు అవే వుపయోగించవలసివచ్చేవేమో! ప్రస్తుతం తన స్థితిగతులు కొంచెం వక్రించినై. గ్రహాలు నీచకోణం వేపు తిరిగివున్నాయి. బెదరించీ, భుజబలం చూపీ నెట్టుకెళ్ళే రోజులు చాలకాలం కిందనే మాయమయిపోయినై. ప్రస్తుతం తనే లొంగిరావాలి. లొంగి ఆ "కాస్తా" ఇటుతిరిగిన తరువాత-వెధవ వీడి లెఖ్ఖేమిటి? వీడితల్లో జేజమ్మలు తిరిగివస్తారు?

అందుకనే నాగేంద్రం ఏమీ మారుపలకలేదు. తనపట్ల వాళ్ళెంత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నా, తనను క్రిమిని చూస్తున్నట్లు చూసినప్పటికీ, అతనేమీ బాధపడలేదు.

చాలా పొద్దుబోయింది. పిల్లలంతా భోజనంచేసి పడుకొన్నారు. నాగేంద్రం స్నానంచేసి, రెండు మెతుకులు కొరికి సిగరెట్టు వెలిగించాడు. అతని మంచం భోషాణానికి పక్కగా వసారాలో వేసింది అత్త. నాగేంద్రం క్షణకాలం నిశ్చలమైపోయినాడు. ప్రథమంగా తను వూహించిందానికీ ఇక్కడ జరుగుతూన్నదానికీ ఎక్కడా సంబంధంలేదు.

"ఇక్కడ వేశావేం మంచం?" అన్నాడు నాగేంద్రం అత్తతో.

"ఉక్కగా వుంటుందంటావా? పోనీ పందిరికింద వేసుకో ...ఏం? వెయ్యమంటావా పందిరికింద?" అన్నది అత్త.

నాగేంద్రం పలికలేదు. చుట్టూ వొకసారి చూశాడు, తనభార్య తండ్రిమంచంప్రక్కనే పక్క వేసుకొని పడుకుంది.

మామగారు చుట్టకాలుస్తున్నాడు. అతనికి తలతీసేసినంత అవమానంగా తోచింది. వెంటనే ఆ అర్ధరాత్రే వెళ్ళిపోదామనిపించింది. రెండు అడుగులు వేశాడు.

"ఇంకా అట్లాగేచూస్తూ నుంచున్నావేమే? అవసరమైతే అతగాడే మార్చుకుంటాడు. నువ్వు పెట్టెలకు తాళాలు వేసి జాగ్రత్తగా బొడ్డోవుంచుకో. కాలంబాగుండలేదు. ఎవర్నీ నమ్మేరోజులు కావివి" అన్నాడు మామ.

నాగేంద్రం ప్రాణం చివుక్కుమంది. తనను పచ్చిదొంగగా తనమామ భావిస్తున్నాడు. అత్తగారిచేత ముఖ్యంగా భార్యసమక్షాన ఇటువంటి అవమానం జరపబడటంకంటే, తన పురుషత్వాన్ని దెబ్బగొట్టటం ఏముంటుంది?

నాగేంద్రం మంచాన్ని పందిరికిందకు లాక్కోబోతున్నాడు. గంగన్న—మామగారి జీతగాడు—"ఎందుకులేండి మీరు లాక్కోవటం, నేతెత్తాను తాలండి" అని వాడే పందిరికిందకు లాగి. పక్కనే, తన చాపా, గోనెపట్టాలు పరుచుకొన్నాడు.

ఆరాత్రి నాగేంద్రానికి నిద్రపట్టలేదు. రకరకాల ఆలోచనలుబుర్రను జలగల్లాపట్టి పీకుతున్నాయి. రేపు కథను ఎట్లా సానుకూలపరుచుకోవాలి? వాళ్ళందరూ పలకకపోవటానికి కారణమేమిటి? శ్రీదేవి తన బండారం కాస్తా ఇక్కడ బైటపడేసిందా? తను ఇక్కడకు వొచ్చినప్పటికీ, గదిలో మంచం వెయ్యక ముష్టివెధవను పడుకోబెట్టినట్లు వీధిలోకి తొయ్యటమేమిటి? ఒకవేళ శ్రీదేవి కుర్రతనంవల్ల మోయించినా,

తల్లయినా సరిదిద్దవచ్చుగదా? ఆమెగారు, మామగూడా నిర్లిప్తంగా వూరుకొన్నారేం?

ఈ విధంగా ఆ రాత్రల్లా నాగేంద్రం ఆలోచిస్తూనే వున్నాడు. వాటికి సరైనసమాధానం తెల్లవారి మామగారు ఇచ్చాడు.

"నాయనా అయిందేదో అయింది. ఇక నీదారి నువ్వు చూచుకోవొచ్చు" అన్నాడు మామగారు చివరికి తేల్చి.

"అంటే ఏమిటో అర్థంగాలేదు" అన్నాడు నాగేంద్రం.

"అర్థంగావటాని కిందులో ఏముంది? మీకూ మాకూ యింతటితో సంబంధం రద్దుచేసుకోమంటున్నాను."

"ఎందుకూ?" అన్నాడు నాగేంద్రం పెద్దగా గొంతు పెంచి.

"అంతచేటు పగలదీసుకో నక్కర్లేదు." మెల్లిగా మాట్లాడు. నీకు భార్య ఎక్కువయినంత మా తాన నాకు కూతురు ఎక్కువగాదు. నీబోటి అంట్లవెధవ దగ్గిరికి పంపించి దాని వుసురు నే నెక్కడ పోసుకో నేద్చి? నా నలుగురు మొగ పిల్లలతో బాటు అదీ వొక పిల్లవాడనుకొంటాను. ఇక మీరు మర్యాదగా దయచెయ్యొచ్చు"

చుట్టూతా జనం కూడసాగారు. అంతమంది ఎదుటా మామచేత ఆమాటలు పడిన తరువాత, నాగేంద్రం నిర్వీర్యు డయిపోయినాడు. కాస్త సంబాళించుకొని తిరిగి పుంజు కొన్నాడు.

"మీతోటి నాకు సంబంధంలేదు. మీరెవరో, నేనె వరో. నేను నీకోసం రాలేదు. నాభార్య కోసం వొచ్చాను"

"ఇంకేం! అది వొస్తానంటే తీసుకెళ్ళు, నా అభ్యంతర మేమీ లేదు" అన్నాడు మామగారు.

నాగేంద్రం భార్యను పిలిచాడు. తలుపుచాటున వుండి ఈ రభసను చూస్తున్న శ్రీదేవి, మెల్లగా ముందుకొచ్చి, తల వొంచుకొని నిలబడింది.

"మీ నాయన అంటున్న మాటలు నువ్వూ విన్నావు. మరి నీ అభిప్రాయమేమిటి" అన్నాడు నాగేంద్రం.

"నేను రాను"

"ఎందుకని?"

తనెందుకురాదో రాలేదో, శ్రీదేవి వివరించింది.

"భార్యాభర్తలన్న తరువాత కొట్టుకోకుండా తిట్టు కోకుండా వుంటారా? రెండురోజులు కీచులాడుకొని వాళ్ళే బాగుంటారు. పంపించండి" అన్నారు అక్కడ చేరినవాళ్ళు.

మామగారు వినలేదు.

"నేను పంపను" అన్నాడు ఖచ్చితంగా.

"అయితే నేను యింకోదోవ చూచుకోవొచ్చు నంటారా! తరువాత మళ్ళీ పేచీపెడితే బావుండదు ఇప్పుడే మీరే తేల్చండి. ఎందుకూ ముసుగులో గుద్దులాట?" అన్నాడు నాగేంద్రం.

"ఓ నిరభ్యంతరంగా చూచుకోవచ్చు. నీ బెదిరింపులకు యిక్కడ బెదిరేవాళ్ళెవరూ లేరు. తాటాకులచప్పుళ్ళకా కుం దేళ్ళు పరుగెత్తటం? ... ఊఁ, బయలుదేరు. ఎండెక్కుతోంది" అన్నాడు మామగారు, హెచ్చరిస్తున్నట్లుగా.

నాగేంద్రం వొక్కసారి భార్య ముఖంవేపు చూశాడు. అందులో అతనికి కావలసిన భావాలేమీ దొరకలేదు. ఒక్క నిట్టూర్పు దీర్ఘంగా విడిచి, చిన్నదగ్గు దగ్గి బైటికొచ్చేశాడు.

రెండుమూడు నెలలు గడిచినాయి. నాగేంద్రం ఇతరత్రా ప్రయత్నాలేమీ చేయలేదు. చేయటం అనవసరమని గూడా అతనికి తెలుసు. అమ్మా, నాన్నా బ్రతికివున్నారు. గనక, ఆరోజుల్లో ఏవో నాలుగు బులిబుచ్చి కబుర్లు చెప్పి, బ్రిహ్మిని తిమ్మినిచేసీ, తిమ్మిని బ్రహ్మినిచేసీ కార్యసాధన విజయవంతం చేశారు. ఈ రోజున తనగతేమిటి? ఏమిచూసి తనకు పిల్లనిస్తారు యిచ్చేవాళ్ళు?

రెండో వివాహవిషయం సంపూర్తిగా నిరాశచేసుకొన్నాడు నాగేంద్రం. హోటల్లో తినటం, ఆఫీసులో పని చెయ్యటం, గదిలో నిద్రపోవటం. ఇట్లాగే కాలందొర్లిపోతోంది.

ఒకరోజు రాత్రి, అతను చాలాసేపు చదువుకొని, నిద్రపోవటం కోసం తలుపు వేసుకొందామని లేచేసరికి, తలుపు పక్కగా ఎవరో ఆడమనిషి, నిండా ముసుగు కప్పుకొని నిలవబడివుంది.

మొదట్లో నాగేంద్రం భయబడ్డాడు. తర్వాత ధైర్యాన్ని కూడతీసుకొని ఆమెను ప్రశ్నించాడు.

"ఎవరు నీవు?"

ఆమె పలకలేదు.

"పోలీసులను పిలవమంటావా?" అన్నాడు నాగేంద్రం లోపలినుంచివొస్తున్న చలిని వీలయినంతవరకు తొక్కిపడుతో నాగేంద్రానికి అపరిమితమయిన భయంవేసింది.

"పిలవండి" అన్నది ముసుగులో మనిషి. ఆకంఠస్వరం తనకు పరిచయమైనదే.

ఎవరు?

ఎవరు??

ఎవరీ మనిషి???

గబగబా లాంతరు తెచ్చి, ముసుగుతొలగించి, చూశాడు. శ్రీదేవి! కళ్ళవెంట నీళ్ళుకారుతున్నాయి. ముఖం వాలిపోయింది. మనిషి చికాకుగావుంది. కాళ్ళనిండా దుమ్ము. చంకలో చిన్న గుడ్డమూట.

ఆమెను చూడగానే నాగేంద్రానికి కోపంవచ్చింది. శరీరం ఆవేశంతో వూగింది. పళ్ళుకొరికాడు. ఇంతక్రితం అతను అనేకసార్లు ఈ సంఘటన యిట్లా జరిగితే బాగుండేదని అనుకొన్నాడు. వాళ్ళకు—ఆ ముసలివెధవలకు బుద్ధిలేక పోవచ్చు. కనీసం శ్రీదేవి అయినాఎందుకు ఆలోచించగూడదు? నాశనమైపోయేది 'తను'గానీ తనఅమ్మా నాన్నా కాదుగా! ఈ విచక్షణ శ్రీదేవిలో ఎందుకు లోపించింది? ఆమె తనంతట తాను వస్తే ఎంతబాగుండును! చివరికి ఏమనిషిచేతనన్నా కబురుచేయిస్తే తనువెళ్ళి నిక్షేపంగా తెచ్చుకొంటాడుగదా!

పాపం! నాగేంద్రం పొరబాటుపడ్డాడు, శ్రీదేవి, తనతో కాపరం చెయ్యాలనే అభిప్రాయమే వుంటే; మొన్న తనువెళ్ళినప్పుడే రావొచ్చుగదా! అసల్కు రావటమనేది శ్రీదేవికి బొత్తిగా యిష్టంలేదు. రాదలుచుకుంటే, తల్లీదండ్రి అడ్డు రానేరారు. మామగారుతన దేమీలేదనీ; అమ్మడు వొస్తానంటే

తనకు అభ్యంతరం వుండబోదనీ కుండబద్దలుగొట్టినట్టు చెప్పనే చెప్పాడు. ఇదంతా శ్రీ దేవి పితలాటకమే!

నాగేంద్రం భార్యాకోసం విచారించినమాట నిజం! ఆ పిల్ల ఏవో కారణాలవల్ల, ఎట్లాగో, తన దగ్గిరికి వచ్చినా బాగుండునని అనుకోవటమూ అబద్ధంకాదు. అట్లా వొకవేళ జరిగేపక్షంలో భార్యను కళ్ళకుఅద్దుకొని స్వీకరించుదామని గూడా అతను అనుకొన్నాడు.

అయితే జరిగింది వేరు. ఎందుకని అట్లా అనిపించిందో మనకు తెలీదు గానీ, ఆమెను చూడగానే మహా కోపం వొచ్చింది.

"ఎందుకొచ్చావ్? ఎవరున్నారనివొచ్చావు!" అన్నాడు నాగేంద్రం పెద్దగా..

శ్రీదేవి మాట్లాడలేదు. మెదలకుండా చంకలో వున్న మూటను పక్కనే పెట్టుకొని, తలుపువారగా కూచుంది. శ్రీదేవి చేసిన ఈ పనితో నాగేంద్రానికి ఆమెమీద అధికారం ఏర్పడినట్లయింది.

"దయచేసి లేవమని విజ్ఞప్తిచేస్తున్నాను. లేకపోతే బలవంతాన బయిటికి గెంటవలసివొస్తుంది. నాబోటిదౌర్భాగ్యుని చేత తమలాంటి ఉన్నతకుటుంబీకులు, అంతపని చేయించుకోరని భావిస్తున్నాను,"

శ్రీదేవి వొకసారి భర్తముఖంలోకి చూసి తలొంచుకొంది.

"అన్నంతపనీ చేసిందాకా తమరు కదలదలుచుకోలేదా ఏమిటి?" అన్నాడు నాగేంద్రం.

"నన్నెందుకింత అవమానపరుస్తారు?" అన్నది శ్రీదేవి.

'ఇందులో తమరికి నేను చేసిన అవమాన మేమిటో బోధపడకుండా వుంది. అయినా యిటువంటి అనుమానాలు నాచేత పొందకుండా—తమరు త్వరగా"

"ఇదంతా గౌరవించటమా? చేసుకొన్న భార్యను 'తమరు'—'మీరు'—'ఏమండీ!' అనటం మరి గౌరవించటమా?" అన్నది శ్రీదేవి.

నాగేంద్రం వులిక్కిపడి, రెండడుగులు వెనక్కి వేసి, చిన్నగానవ్వి, ఆశ్చర్యపడుతున్నవాడి కిమల్లే ముఖంపెట్టాడు.

"ఇదేమిటి - నీనోటినుండి—క్షమించాలి—తమనోటి నుండి చాలా చిత్రమైన విషయాలు వింటున్నాను. నేనెవరికి భర్తనూ? చాలా వింతగా చెబుతున్నారే!" అన్నాడు కసిగా.

"మీరన్నంత మాత్రాన, నేను మీ భార్యనుకాకుండా పోతానా? మీరు 'మావారు' కాకుండా పోతారా?" అన్నది శ్రీదేవి తల ఎత్తకుండానే.

నాగేంద్రంపెదిమలమీద చిన్ననవ్వు పాకి, వెంటనే మాయమయింది. ఏదో విజయం సాధించినట్లు, తలవెనక్కూ ముందుకూ ఆడించాడు.

"నువ్వు నాభార్యవవుతావో కాదో నాకు తెలీదుగానీ, నేనుమాత్రం నీభర్తను కాను. నాభార్య చచ్చింది. ప్రస్తుతం నేను వొంటరిగాణ్ని. అంతగా నాభార్యను చూడాలనే కోర్కె మీకుంటే, రెండువారాల తరవాత రండి. ఈలోపుగా వెంకట సుబ్బయ్యగారి కూతురుతో నా పెళ్ళిజరిగిపోతుంది. సరేనా! ఇక వెళ్ళొచ్చు."

శ్రీదేవి ఈ మాటతో వులిక్కిపడింది. తలపైకెత్తి దిగులుగా నాగేంద్రం ముఖంలోకి చూసింది.

"క్షమించండి! పొరపాటు చేశాను, నా జీవితాన్ని మట్టి పాలు చేయకండి. తల్లినీ, తండ్రినీ, అన్నదమ్ముల్నీ, అప్పచెల్లెళ్ళనూ వొదిలి సర్వమూ మీరే ననుకొని, మీదగ్గిరకొచ్చాను మీరే నాతప్పుల్ని మన్నించకపోతే, నాకు వేరే దిక్కేముంది? ఏంగాను?" అన్నది శ్రీదేవి అతనికాళ్ళ దగ్గిర కూచుని, చేతులతో రెండుకాళ్ళూ గట్టిగా పట్టుకొని.

నాగేంద్రానికి తెరిపివొచ్చినట్లయింది. తను ఇంతసేపూ ఆమెనుండి, ఏమికోరుతున్నాడో 'అది' లభించినట్లుగా తోచింది.

"ఈ జ్ఞానం 'ఆనాడు' వుండవలసింది. ఇప్పుడు పరిస్థితులు నా చేయిదాటిపోయినవి. నేను చేయగలిగిందేమీ లేదు. వెంకటసుబ్బయ్యగారి కూతుర్ని చేసుకోబోతున్నాను. లగ్నాలు పెట్టుకోవటంగూడా ఎప్పుడో జరిగిపోయింది. ఇంకో రెండువారాలలో పెళ్ళిగూడా అవుతుంది. ఇక నువ్వు నిరభ్యంతరంగా మీయింటికి వెళ్ళిపోవొచ్చు!"

"నేనా? ఇక్కడనుండి కదలను."

"కదలకపోతే, నేను కదిపిస్తాను" అన్నాడు ఆమె మీదికి వొంగి.

"మీరు నన్ను కొట్టండి, తిట్టండి, తన్నండి, చీల్చండి. ఆ హక్కు నామీద మీకున్నది. ఏనాడు నామెడకు మూడు ముళ్ళూ వేశారో, ఆనాడే నేను మీసొత్తునయిపోయినాను.

నన్ను మీరేమిచేసినా నేను వెళ్ళను.” అన్నది శ్రీదేవి అతని కాళ్ళను” గట్టిగా కావిలించుకొని.

“ఇప్పుడేమీ లాభంలేదు. కనీసం పదిరోజుల కిందట నువ్వు వొచ్చినట్లయితే, ఎట్లావుండేదో నేను చెప్పలేను. వెంకట సుబ్బయ్యగారికి మాట యిచ్చాను.” అన్నాడు నాగేంద్రం.

“నా రాత ఎట్లావుంటే ఆవిధంగా జరుగుతుంది. కాని వ్వండి. మీ సుఖానికి నేను అడ్డంరాను. మీరు రెండో వివాహం చేసుకోండి. మీ పాదాలదగ్గిర బెత్తెడు స్థలం నాకు ప్రసాదించండి. మీసేవ చేసుకొంటూ వుంటాను.” అన్నది శ్రీదేవి అతని కాళ్ళకు ముఖాన్ని గట్టిగా హత్తి.

“నీ పీడ వదిలిపోయింది గదా అని సంతోషించాను. మళ్ళీ శనిగ్రహమల్లే నన్ను తగులుకొన్నావు. ఛీ”. అంటూ నాగేంద్రం కాళ్ళు విదిలించుకొని దూరంగా వెళ్ళి నిలబడ్డాడు.

శ్రీదేవి నాలుగునిమిషాలు అట్లాగేచూచి, తరువాత, తలుపు పక్కనేవున్న మూట తెచ్చి, గదిలో వొకమూలగా పెట్టింది. తలుపులు వేసి గడియపెట్టింది.

“మీరు కొంచెం పక్కకు తప్పుకోండి. ఇల్లంతా శుభ్రంగా వూడుస్తాను. మరీ నానాగిజాటుగా వుంది” అన్నది శ్రీదేవి.

“అక్కర్లేదు. నేను వూడ్చుకొంటాను” అన్నాడు నాగేంద్రం మూలగావున్న చీపురుకట్టవేపు పోతూ.

శ్రీదేవి రెండడుగుల్లో చీపురుదగ్గిరకెళ్ళి గభాలున చేతిలోకి తీసుకొంది.

“అక్కర్లేదు. విడువ్” అన్నాడు.

"విడవను. మీరు చీపురు పట్టుకోటం నేను కళ్ళారా చూడలేను"

"అది తరవాత సంగతి. ముందు చీపురు వదలాలి."

"ఏం? నేనేం పాపంచేశాను? నా యిల్లు నేను శుభ్రం చేసుకోగూడదా?" అన్నది శ్రీదేవి ఏడుపుముఖంపెట్టి.

"ఇది నీయిల్లు గాదు."

"పోనీయండి. ఇంతక్రితం నన్ను "దాసి"గా స్వీకరిస్తామన్నారు. కనీసం ఆ హోదాతోనన్నా నన్ను వూడ్వనివ్వండి."

నాగేంద్రం ఇంకోమాట లేకుండా, ఒక్క విదిలింపు విదిలించుకొని బైటికివొచ్చి, వాకిట్లో నిలబడ్డాడు.

పదినిమిషాలకల్లా శ్రీదేవి యిల్లు శుభ్రంగా వూడ్చింది. చిలుముబట్టిన యిత్తడిగ్లాసును ఇసకబెట్టి పచ్చగా తోమింది. నాగేంద్రానికి చక్కగా పక్క అమర్చింది. నాగేంద్రం లోపలికొచ్చి, ఇల్లు నాలుగుమూలలూ చూసి, మంచంమీద పడుకొన్నాడు కళ్ళుమూసుకొని.

అతనికి నిద్రపట్టట్లేదు. కొంచెంసేపటికి శ్రీదేవి గొంతు వినిపించింది.

"ఛీ! ముదనష్టపన్నం, పాచిపోయింది. తింటానికేం పనికొస్తుంది?"

నాగేంద్రం చప్పునలేచి, చొక్కాతొడుక్కొని బైటికి వెళ్ళాడు. ఈలోపుగా శ్రీదేవి, అలమరాతీసి, నూనె రాసుకొని, తల దువ్వుకొంది. సబ్బుపెట్టి ముఖం కడుక్కొంది. ఈ కార్యక్రమం ముగుస్తుండగానే నాగేంద్రం వొచ్చాడు. వొచ్చీరావటంతోనే చేతిలోవున్న రెండు పొట్లాలనూ శ్రీదేవిమీదికి విసిరి,

మాటాపలుకూ లేకుండా, మంచంమీద కెళ్ళి ముసుగుపెట్టు కొన్నాడు.

శ్రీదేవి ఆ మిఠాయి తిన్నది. కూజాలో నీళ్లు తాగింది. దీపం చిన్నదిగా తగ్గించి, నాగేంద్రంమంచంపక్కనే చాప వేసుకొని పడుకొంది.

...ఒక రాత్రివేళ నాగేంద్రానికి, ఏదో అలికిడి అయి నట్లు తోచి, కళ్ళు తెరిచాడు. శ్రీదేవి మంచంమీద కూచుని, అతని కాళ్ళు పిసుకుతున్నది! ఏదో అందామని నాగేంద్రం ప్రయిత్నంచేశాడుగానీ, లాభం లేకపోయింది. అతని గొంతుకు వుండలాంటిదేదో అడ్డుపడి, ఆ మాట పైకి రాలేకపోయింది. చిన్న దగ్గుదగ్గి మళ్ళీ ముసుగుపెట్టుకొన్నాడు.

అరగంట గడిచిన తరవాత, శ్రీదేవి మెల్లిగా, అతన్ని నెడుతూ "కొంచెం పక్కకి జరగండి. చాపమీద పడుకొంటే మరీ ఎముకలు వొత్తుకుపోతున్నాయి" అన్నది.

ఈ మాటలు నాగేంద్రానికి వినిపించినయ్యో, లేదో చెప్పటం చాలాకష్టం. అతనుమాత్రం గురకపెడుతూనే పక్కకు జరిగాడు. శ్రీదేవి శరీరం మిగిలినభాగాన్ని ఆక్రమించింది...ఒక రాత్రివేళ నాగేంద్రం పెదిమలు శ్రీదేవిని ముద్దు పెట్టుకొంటు న్నాయి. అతనిచేతులు ఆమె శరీరాన్ని దగ్గిరిగా పొదువుకొం టున్నాయి. ఆమెచేతులు అతని నడుమును చుట్టుకొని వున్నాయి. తనకు యిష్టంలేని ఆ పాపిష్టికార్యం చెయ్యటా నికి, అతని అంతరాత్మ, ఎంత ఘోషపెట్టిందో భగవంతుడికే తెలియాలి.

*　　*　　*　　*　　*

శ్రీదేవి అదృష్టవంతురాలు. నాగేంద్రం రాండో పెళ్ళి చేసుకోలేదు. ఏదో ఒకటి రెండురోజులు ముభావంగావుండటం తప్ప, తరవాత వాళ్ళిద్దరూ బాగానేవున్నారు. శ్రీదేవి తల్లి దండ్రులు వొకసారి రహస్యంగా వొచ్చి, కూతుర్ని చూసి పొయ్యారని, కొంతమంది చాటుమాటుగా అనుకొనేమాటల్లో, ఎంతవరకు నిజం వున్నదో మనకు తెలీదు.

ఇన్నిటికీ అదృష్టజాతకుల్ని ఎవ్వరూ చెరపలేరు, శ్రీదేవి ఇక్కడకు వొచ్చిన అయిదోనెలకు ప్రసవించి, మొగ పిల్లాణ్ని కన్నది. కానీ, శ్రీదేవి కనిన పిల్లవాడికీ, గంగ న్నకూ ఆట్టే భేదంలేదని, కిట్టనివాళ్లు కొందరనవొచ్చు. ఆ మాటలు నిజంగూడానేమో! అయినా ఇవన్నీ మనకనవసరం. ఇటువంటి పాపపుమాటలు బొత్తిగా మనం అనుకోగూడదు.